
# కర్మవీరుడు

**వచ్చేది కొంచెమే అయినా, కష్టార్జితంలో ఉన్న ఆనందం, ఆత్మసంతృప్తి అనిర్వచనీయం. ఒంట్లో ఓపికున్నంతవరకు రెక్కల కష్టం మీదే బతకాలనుకున్న ఓ కర్మవీరుడి కథ... అలాంటి ఎంతోమంది పెద్దవాళ్ళ వ్యథ...**



చిత్రాలు: నర్సిం

కోటయ్య బడిలో పని మానుకోడు!

"చెయ్యో, కాలో విరగాలి, లేదా చావైనా రావాలి. అంతవరకు నేనిలా ఉండాల్సిందే" అంటాడు.

అసలు పని మానుకుంటే వేరే జరుగుబాటు లేదని కాదు, అతని భార్య మంగమ్మ చేతి ఇడ్లీలకు, వడలకు మంచి గిరాకీ ఉంది. పెద్ద కొడుకు దేవరాజు ఈ మధ్యనే ఇంటి ముందర టీకొట్టు పెట్టాడు. ఇక చిన్న కొడుకు బాలరాజు బి.ఏలో బోల్తాపడి, ఉద్యోగం కోసం పాకులాడుతున్నాడు. నిదానం మీదట వాడికి ఉద్యోగం దొరకవచ్చు. అంతవరకూ సిగ్గును ఒక పక్కకునెట్టి వాడూ చేయి కలిపితే ఇంటి ముంగిట్లోనే, ఏ చిన్న మిలిటరీ హోటలు లాంటిదో, బడ్డీ కొట్టో వెలగబెట్టవచ్చు. వ్యాపార దృష్టి ఉన్నవాడికి కోటయ్య ఇల్లు బహు చక్కని చోటు. సినిమాకు వెళ్ళే వాళ్ళందరూ ఆ రోడ్డు మీదుగానే వెళ్ళాలి. పక్క పల్లెలోని జనమంతా ఆ రోడ్డు వెంబడే ఊళ్ళోకి రావాలి. నట్టనడి ఎడారిలో చలివేంద్రం లాగా వాళ్ళకది ఉపయోగపడవచ్చు. ఇంటికెదురుగానే అటు హైస్కూలు, ఇటు ఎలిమెంటరీ స్కూలు.

కానీ, కోటయ్యకు ఇవేమీ పట్టవు.

అతను పాతకాలపు మనిషైనా, పట్టుదల కలవాడు.

ఆ ముసలివాడికున్న ఆత్మస్థయిర్యం మరెవ్వరిలోనూ కనిపించదు.

"కూలో నాలో చేసి ఇన్నాళ్ళూ పెంచాము. ఇప్పుడు వాళ్ళకూ రెక్కలొచ్చేశాయి. ఇంకా ఎందుకు ఆ చాకిరీ" అంటుంది పెళ్ళాం.

"నాకు ఎవడూ పెట్టనక్కరలేదు. వాళ్ళ బతుకులు వాళ్ళు బతికితే చాలు. ఒంట్లో సత్తువ ఉన్నంత వరకు నాకేం భయం లేదు. నేను మూలపడితే, తరువాత ఎట్లన్నా కానీ" అంటాడు కోటయ్య.

ఆ హైస్కూల్లో ఎందరో హెడ్మాస్టర్లు మారారు. మరెందరో పంతుళ్ళు మారారు. మారుతూనే ఉన్నారు. కానీ, కోటయ్య మాత్రం ఆ ఊరికి హైస్కూలు వచ్చినప్పటి నుంచీ అక్కడే ఉన్నాడు.

ఆ బడిలో స్వీపరు ఎవరూ అంటే, కోటయ్య!

ఆ బడిలో తోటమాలి ఎవరూ అంటే, కోటయ్య!

ఆ బడికి వాచ్‌మెన్ ఎవరూ అంటే కూడా కోటయ్యే!

ఉదయం లేస్తూనే గదులన్నీ తుడిచి శుభ్రం చేస్తాడు. సాయంకాలం మొక్కలన్నిటికీ నీళ్ళు తోడి పోస్తాడు. రాత్రిళ్ళు స్కూల్లోనే పడుకుంటాడు.

ఇంతా కష్టపడితే, అతనికి వచ్చే జీతం అతి స్వల్పం. కానీ, ఆ కష్టార్జితాన్ని అతను సంతోషంతో, భక్తితో కళ్ళకద్దుకుంటాడు. తృప్తిగా నిట్టూర్చి బొడ్లో దోపుకుంటాడు. ఆ స్వల్ప వేతనంతోనే తాను ఇన్నేళ్ళూ బతికాడు. దానితోనే సంసార నౌకను ఒడిదుడుకులతో నెట్టుకుంటూ వచ్చాడు. ఎలాగో తంటాలుపడి చిన్న కొడుకును ఆ మాత్రమైనా చదివించాడు.

కోటయ్య అంటూ ఉంటాడు పెళ్ళాంతో, "అడ్డాలప్పుడు బిడ్డలుగానీ, గడ్డాలొచ్చాక బిడ్డలవుతారా? ఎప్పటికైనా వాళ్ళదారి వాళ్ళదే. ఏదో ఉద్ధరిస్తారని మనం భ్రమపడాల్సిందేగానీ, చివరికి రాబోయేది చేతికి చిప్పే! ఎవరికి ఎవరవుతారు ఈ కాలం? తండ్రికి కొడుకు కాడు, అన్నకు తమ్ముడు కాడు. ఏదో రుణం ఉన్నాం. తీరిపోయింది. ఇక వాళ్ళ దారి వాళ్ళు వెతుక్కుంటే చాలు. మనకేమీ పెట్టాల్సిన పనిలేదు. స్కూల్లో దివాణం వంటి నౌకరీ ఉన్నంతవరకూ మనకేమీ భయం లేదు.

కొడుకులకు కోపం వస్తుంది. రోషంలో, పట్టుదలలో తండ్రి కన్నా రెండాకులు ఎక్కువే చదివారు వాళ్ళు. "ముసిలోడా! ఎంతసేపూ మమ్మల్ని ఎత్తిపొడవకపోతే నీకు గడవదా? ఊరికే మా పావం పోసుకుంటావు. అసలు నిన్నెవరు చావమన్నారు స్కూల్లో? 'నౌకరీ మానేయి, హాయిగా ఇంట్లోనే పడి ఉండు' అని మొతుకుంటున్నా ఎక్కడ వింటావు? ఏమైనా చచ్చే ముసలాడికి ఇంత పంతం ఉండకూడదు" అంటూ చిర్రుబుర్రులాడతారు.

"పోపోండ్రా! తాతకు దగ్గులు నేర్పాలంటారు కుర్రకుంకలు" అంటూ గొణుక్కుంటాడు కోటయ్య.

* * *

ఓ ఆదివారం రోజున, సుస్తీగా ఉంటే, ఆ రాత్రి ఏమీ తినకుండానే పడుకునేందుకు స్కూలుకు బయలుదేరాడు కోటయ్య. తాను స్కూలుకి వాచ్‌మెన్ ఆయె మరి.


లోపలికి వెళ్ళి గేటు తలుపులు తాళం వేసుకున్నాడు.

కాంపౌండు యార్డులో లైటు వెలుగుతోంది.

ఒంట్లో నీరసంగా ఉంది కోటయ్యకు. పడుకుంటేనేగానీ తట్టుకోలేడు.

ఆఫీసు గది పక్కగదిలోకి వెళ్ళాడు. రోజూ అక్కడే పడుకుంటాడు డెస్కుల మధ్యగా. గదిలో పూరికప్పు కింది దూలాలు అతని చింకి చాపకూ, పాత దిండుకూ విశ్రాంతి స్థలం. డెస్కు మీది కెక్కి, వాటిని లాక్కుని కింద పరుచుకుని పడుకున్నాడు. అతని పెంపుడు కుక్క గేటు సందులోనుంచి దూరి, లోపలికి వచ్చేసి అతని కాళ్ళ దగ్గర ముడుచుకు పడుకుంది.

కోటయ్య అంటే దానికి ఎంతో విశ్వాసం. ఏడేళ్ళుగా అతని అండలోనే ఉంటోంది. ఈ ఏడేళ్ళలో ఎన్నో పిల్లల్ని కన్నది. కానీ, ఒక్క పిల్ల కూడా లేదిప్పుడు. ఎవరెవరో ఎత్తుకెళ్ళి



పెంచుకున్నారు. మరి కొన్ని బాగా తిరగమరిగి వీధి కుక్కల్లో కలిసిపోయాయి. కానీ, ఈ కుక్క ఎక్కడికీ పోలేదు. కోటయ్య ఇల్లే దానికి ఆశ్రయం. కోటయ్య సన్నిధానమే దానికి మోక్షం. అందుచేతనే అది ఎక్కడికీ పోలేదు. ఎక్కడికీ పోదు. ఎప్పుడో కోటయ్య కాళ్ళ దగ్గరే చచ్చి ఊరుకుంటుంది.

కోటయ్య దాన్ని ప్రేమగా ఒడిలోకి తీసుకున్నాడు.

కోటయ్యకు ఇష్టమైనవి రెండే- తాను సేవిస్తున్న స్కూలు, తనను సేవిస్తున్న కుక్క!

తన కాళ్ళ దగ్గరే కుక్కకు నిద్ర. స్కూలు ఆవరణలోనే తనకు నిద్ర.

కుక్క తనని విడువదు. తాను స్కూలును విడిచి ఉండలేడు.

ఇక్కడున్నంత హాయి తనకు ఇంట్లో కూడా ఉండదు.

కింద గచ్చు లేచిపోయిన నేల, చుట్టూ ఇరుకుగా డెస్కులు, నేల మీద పేరుకొన్న దుమ్మూ ధూళీ, నిర్మానుష్యంగా ఉన్న పరిసరాలు, నిశ్శబ్దంగా ఉన్న పాఠశాల భవనం, ఆవరణలో దయ్యాల్లా పెరిగి ఉన్న చెట్లు, తరగతి గదుల చుట్టూ నల్లటి నీడలు, భయంకరమైన ఏకాంతం...

ఇవేమీ అతనికి పట్టింపులోనివి కావు.

మరునాడు బద్ధకంగా నిద్ర లేచేసరికి భళ్ళున తెల్లవారిపోయి ఉంది. కోటయ్య గుండె గుబిల్లు మంది. ఇంత ఆలస్యంగా లేస్తే, పది అయ్యే లోపున తాను ఏం పనులు చేసేటట్లు? డెస్కు కింద ఒదిగి కూర్చుని అతనివైపే దీక్షగా చూస్తున్న కుక్క- అతను లేవగానే తోక ఆడిస్తూ ఒళ్ళు జాడించుకొంది.

కోటయ్య గబగబ చాప చుట్ట చుట్టి, దాన్ని దూలాల మీద ఉంచడానికి డెస్కుమీదికెక్కాడు. కళ్ళు గిర్రున తిరిగాయి. ఏం జరిగిందో తెలియలేదు.

కొన్ని క్షణాల తర్వాత కోటయ్యకు తన పరిస్థితి తెలిసింది. తాను డెస్కుల సందుల్లో పడిపోయి ఉన్నాడు.

కోటయ్య లేచి నిలబడి, మళ్ళీ దభేలున పడిపోయాడు.

"అయ్యయ్యో! కాలు విరిగిపోయింది" అంటూ మూలిగాడు.

కుఁయ్ కుఁయ్ మంటూ అతని చుట్టూ తిరిగింది కుక్క. గేటు దగ్గరకు పరిగెత్తింది. మళ్ళీ అతని దగ్గరకు పరిగెత్తుకొచ్చింది.

కోటయ్య చిన్నగా దేకుంటూ దేకుంటూ గేటు దగ్గరికి వచ్చాడు. గేటు తాళం తీసి బయటపడ్డాడు. కుక్క 'కుఁయ్యో' మని అరిచింది, ఎవర్నో పిలుస్తున్నట్లుగా. తన గుడిసెను చూసేసరికి కోటయ్యకు ఏడుపు ముంచుకొచ్చింది. దేవరాజు టీ కలుపుతూ కనిపించాడు.

"ఒరే నాయనా, దేవరాజూ! కాలు విరిగిపోయిందిరా! రండిరా! అయ్యయ్యో! కాలు విరిగిపోయిందిరా నాయనా" అంటూ వలవలా ఏడ్చేశాడు కోటయ్య. దేవరాజు పరుగెత్తుకొచ్చాడు. కోటయ్యను రెండు చేతులతో భుజం మీదికెత్తుకొని ఇంటి లోపలికి తీసుకువెళ్ళాడు.

"నేనేం జేతున్రా దేవుడా! నా కాలు విరగ్గొట్టేశావు గదరా దేవుడా! ముసలితనంలో నాకేం గతి పట్టిందిరా దేవుడో" అంటూ అరగంటసేపు ఆక్రోశించాడు కోటయ్య.

కానీ, అతని కాలు విరగలేదని తేలింది. అయితే, బాగానే బెణికింది. శరీరంలో అక్కడక్కడా లోదెబ్బలు తగిలాయి. కోటయ్య కదలలేకపోయాడు.

ఇక స్కూల్లో పనిచేయలేడు కోటయ్య. స్కూలు గోడల దగ్గరికైనా నడిచిపోలేడు.

"హెడ్మాస్టర్ని లీవడిగితే ఇస్తాడంట్రా" అన్నాడు కొడుకుతో.

"ఎందుకివ్వడూ" అన్నాడు బాలరాజు.

డాక్టరు దగ్గరికెళ్ళి, మెడికల్ సర్టిఫికెట్ పట్టుకొచ్చాడు దేవరాజు.

'ఇక లీవెందుకూ? శాశ్వతంగా లీవు తీసుకో' అంటే వినేవాడు కాదు కోటయ్య. అది తెలుసు కొడుకులకు. ఇక ముసలివాడి కాలు బాగుపడదు అని వాళ్ళ అంచనా. అందుచేత, ఊరికే లీవు రాసుకుంటే మాత్రం ఏం పోయిందిలే అనుకున్నారు.

"రెండు నెలలు అడుగుదాం" అన్నాడు బాలరాజు.

"రెండు నెలలే" అన్నాడు కోటయ్య. 'రెండు యుగాలే' అన్నట్లు.

"రెండు నెలలు రాసుకోకపోతే ఎట్లా మరి? ఒళ్ళు నయం కావద్దూ" అంటూ ఒప్పించారు కొడుకులు.

కారణం వివరిస్తూ సెలవు దరఖాస్తు రాసి, కోటయ్య చేత బొటనవేలి గుర్తు వేయించి, డాక్టరు సర్టిఫికెట్ జోడించి, హెడ్మాస్టరుకు ఇచ్చి వచ్చాడు బాలరాజు.

ఊళ్ళో పేరుప్రఖ్యాతులున్న నాటు వైద్యుడు వచ్చి, కోడిగుడ్డు పట్టు వేసి వెళ్ళాడు.

ఆ రోజంతా ఒకటే ముఖారి రాగాన్ని ఆలపించాడు కోటయ్య. "నా గతి ఇంకేముందిరా దేవుడా! మక్కెలు విరగ్గొట్టి మూల కూర్చోబెట్టేశావే! రేపట్నుంచీ నా కింత కూడెవరు పెడతారు? నా కింత మన్ను ఎవరు వేస్తారు" అంటూ వాపోయాడు.

"ఇదుగో, ఇక ఊరుకుంటావా, ఊరుకోవా" అంటూ గదమాయించారు కొడుకులు.

ఆ రాత్రి నిద్రపట్టలేదు కోటయ్యకు. కాస్సేపయినా ఊరుకోడు. ఏదేదో గొణుగుతాడు. నిమిషనిమిషానికీ వినుక్కుంటాడు.

"చీకటి గుయ్యారంలా ఉంది ఈ కొంప! కొంపా, కొంపకు బట్టిన పీడా! ఛూ" అంటాడు.

"అబ్బబ్బ! నరికి పారెయ్యండ్రా ఈ దోమల్ని! ఈ దోమలుంటే ఇక నిద్దరబట్టినట్లే" అంటాడు. నిజానికి ఇక్కడికన్నా స్కూల్లోనే ఎక్కువ దోమలున్నాయి. అక్కడి దోమలకాట్లకు బాగా అలవాటు పడిన కోటయ్యకు ఇక్కడి దోమలకాట్లు ఆనందదాయకంగా లేవు కాబోలు!

అతని కాళ్ళదగ్గరే పడుకుంది కుక్క. దాన్ని ముసుగు లోపలగా రొమ్ముల దగ్గరికి తీసుకున్నాడు. "అమ్మా, చూడమ్మా! నా కాలు విరిగిపోయింది. నేను చచ్చిపోతానే తల్లీ. తరువాత ఎక్కడికి పోతావు? నా మీద నీకెంత పాశమే ఎర్రిదానా! దా. బాగా పడుకో. నిద్దరపో" అంటూ గద్గదస్వరంతో దాని ఒళ్ళంతా నిమిరాడు.

"ఏమమ్మా, నిద్దర పట్టలేదూ? స్కూల్లో అయితే బాగా నిద్రపోయే దానివి. అవును, ఇక్కడ ఏమీ బాగాలేదు. చూడు ఒకటే దోమలు. చీకటి కొంప" అన్నాడు మళ్ళీ.

కుక్క అన్నీ మౌనంగా వింటూ పడుకొంది.

* * *

రెండు వారాల్లో అటూ ఇటూ చిన్నగా తిరగసాగాడు కోటయ్య.

**కోటయ్యకు ఇష్టమైనవి రెండే- తాను సేవిస్తున్న స్కూలు, తనను సేవిస్తున్న కుక్క! తన దగ్గరే కుక్కకు నిద్ర. స్కూలులోనే తనకు నిద్ర. కుక్క తనని, తాను స్కూలును విడిచి ఉండలేరు.**



"అయ్యా, ఒక నెలా లేదు, రెండు నెలలూ లేదు. నువ్వు చచ్చేంతవరకూ నీ కింక లీవే. రామా, కృష్ణా అనుకుంటూ నీ మంచం మీద నువ్వు పడి ఉండు" అని అన్నాడు బాలరాజు.

ఏమీ పాలుపోవడం లేదతనికి. పొద్దు గడవడం కష్టంగా ఉంది. చేయడానికి పని లేదు కదా మరి.

నెల తిరక్కుండానే కోటయ్యకు కాలు బాగైపోయింది.

ఈలోగా అదృష్టం పండి బాలరాజుకు రైల్వేలో ఉద్యోగం వచ్చింది. అదే ఊళ్ళో వాటర్‌మేన్‌గా పోస్టు చేశారతన్ని. వారం రోజులుగా పనికి వెళ్ళి వస్తున్నాడు.

ఒకనాటి ఉదయం కోటయ్య గొణుక్కుంటున్నాడు-

"నన్ను ఎట్లాగూ కాకుండా చేశారు. నా నౌకరీ ఊడగొట్టాలనే ఇదంతా!

రెండు నెలలు లీవు రాసుకోవడం దండగైపోయింది. నా తెవివి నేమనాలి? ఒక్క నెల రాసుకుని ఉండకూడదూ?"

డ్యూటీకి వెళ్ళడానికి గబగబ బట్టలు తొడుక్కుంటున్న బాలరాజు అన్నాడు: "అయ్యా, ఒక నెలా లేదు, రెండు నెలలూ లేదు. నువ్వు చచ్చేంతవరకూ నీ కింక లీవే. రామా, కృష్ణా అనుకుంటూ నీ మంచం మీద నువ్వు పడి ఉండు."

పిల్లవాడికి వచ్చినట్లు వచ్చేసింది కోటయ్యకు ఏడుపు.

అతని వ్యవహారం ఇంట్లో వాళ్ళకు ఏమాత్రం నచ్చలేదు.

"ఛీ ఛీ! ఏం మనుషులో పాడు. వయస్సు పైబడుతున్నా పెద్ద తరహా అన్నది లేదు. ఎంత చెప్పినా బూడిదలో పోసిన పన్నీరే" అన్నాడు దేవరాజు.

కోటయ్య దండ తాడిత భుజంగంలా కన్నున పైకి లేచాడు.

"నోరు ముయ్యరా పోరంబోకా. ఎక్కడ మీ జేజినాయన దొరతనం జేసింది? మహా పెద్ద ప్రయోజకులైనట్లు నన్నెక్కిరిస్తారు. నేను నౌకరీ జేసుకుంటే మీకెందుకురా అవమానం? ఏదో ఆ రోజున చెప్పరాదూ ఆ మాట? 'ఏదో పుట్టి పోయాం, మీరెందుకు కష్టపడతారులెండి పాపం, ఏ దిబ్బలోనైనా పారేయండి బతికిపోతాం' అని? ఈ రోజు నోటికి వచ్చినట్టు కూస్తారూ? ఎంత బడాయి! నాకు ఈ పాటి నౌకరీ లేకుండా ఉంటే, ఇంకా ఈ భూమ్మీద ఉండేవాళ్ళేనా మీరు? నీలిగి చచ్చి ఉండేవాళ్ళు గదరా! హైాయ్! నాకు పాఠాలు చెబుతారు - పిల్లకుంకల్లారా!"

దేవరాజు నోరు నొక్కుకున్నాడు.

బాలరాజు డ్యూటీకి వెళ్ళిపోయాడు.

లీవు ముగిసేంతవరకూ ఇంట్లో ఈ చిటపటలు కొనసాగుతూనే ఉన్నాయి.

"అయ్యా! ఈ గాడిద చాకరీ ఇన్నాళ్ళూ విధి లేకుండా చేశావు. మేమూ ఈనాడు సంపాదించ గలిగిన వాళ్ళమైనాము. తండ్రి రుణం మరిచిపోయే విశ్వాసఘాతుకులం కాము. ఇంకా ఎందుకీ బండ చాకిరీ చెప్పు? మేమున్నాం కదా, ముసలితనంలో కూడా ఈ అవస్థ ఎందుకు చెప్పు" అంటూ చిలక్కి చెప్పినట్లు చెబుతున్నారు కొడుకులు.

చిలక ఎదురు పలికింది. "అది కాదురా, నాకేం రోగమా అని! పోనీ, ముసిలోణ్ణా? గుండ్రాయిలా ఉన్నాను గదరా. ఇస్కూల్లో పనంటే ఎంత? గడ్డిపోచతో సమానం! ఇంత సుళువైన పని ఇంకెక్కడైనా ఉంటుందా!"

"అయ్యా! నువ్వు ముసలాడివి కాదంటే, ఎవరైనా నవ్విపోతారు. నీ వయసు స్కూల్లో ఎలా రాసుకున్నారో, ఏమో! నలభై ఏళ్ళప్పుడు పనిలో చేరి ఉంటే, పాతికేళ్ళు అని రాసుకుని ఉంటారు. ఇక ఆ నౌకరీ వద్దు. ఆ ముష్టి డబ్బులూ వద్దు! నువ్వు మానుకో! కాలుకదపనవసరం లేకుండా నీ కన్నీ జరిగిపోతాయి."

కోటయ్య కొడుకుల మాటలకు సవాలు పలుకుతూ వచ్చాడు కానీ, వాళ్ళది ఎడతెగని పోరుగా పరిణమించేసరికి తన నోటికి తాళం వేసుకున్నాడు. ఎవరేమన్నా నిరుత్తరుడిగా ఉండిపోయేవాడు. అతని మౌనాన్ని, మెతకదనాన్ని చూసి, "ఇకనేం దారికి వస్తున్నాడులే అనుకుని తృప్తి పడ్డారు కొడుకులు.

* * *

లీవు పూర్తయిపోయింది.

ఈ రెండు నెలలూ ఇంటి దగ్గరే పడి ఉన్న కోటయ్య ఆ రోజున కోడికూతతోనే లేచి, బోను లోంచి బయటపడ్డ ఎలుకలా చరచరా స్కూల్లోకి వెళ్ళిపోయాడు. గేటు దాటి మళ్ళీ బయటికి రానేలేదు. చెత్త ఊడ్చి గదులన్నీ శుభ్రం చేశాడు. సాయంకాలం మొక్కలన్నిటికీ నీళ్ళు తోడిపోశాడు. రాత్రి స్కూల్లోనే పడుకున్నాడు, కుక్కను కావలించుకుని. అన్నానికైనా ఇంటికి రాలేదు.

కొడుకులిద్దరూ అగ్గి మీద గుగ్గిలమవుతుంటే, మంగమ్మ మాత్రం స్కూల్లోకే అన్నం పట్టుకుపోయింది. ■